
# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 22, మే 2026 | సంపుటి :03 | సంచిక :105 | పేజీలు :05 | వెల ₹5

# త్రివేణి సంగమంలో పుష్కర పరవళ్లు

దక్షిణ కాశిలో ఆధ్యాత్మిక వెల్లువ.. కాళేశ్వరం తీరాన 'సరస్వతీ' వైభవం





- 'అధికారికంగా' సరస్వతీ అంత్య పుష్కర మహోత్సవం
- వేద మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా అంత్య పుష్కరాల అంకురార్పణ
- గవర్నర్ దంపతులు, కంచి పీఠాధిపతి, మంత్రులు, ఎమ్మెల్యేలు పుణ్యస్నానాలు
- శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారు తొలి పుష్కర స్నానం
- కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో గవర్నర్ దంపతుల పూజలు
- నూతన మ్యూజియంను ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా..
- వారణాసి పండితుల 'నవరత్న మాలా హారతి'తో పరవశించిన భక్తజనం

ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం వేద మంత్రోచ్ఛారణలతో మారుమ్రోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రమైన అంతర్వాహిని సరస్వతీ సంగమంలో గురువారం ఉదయం 5:43 గంటల శుభ ముహూర్తాన అంత్య పుష్కరాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేకువజామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. త్రివేణి సంగమ, త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరం అత్యంత అరుదైన ఈ ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటివరకూ కేవలం సాంప్రదాయానికే పరిమితమైన సరస్వతి అంత్య పుష్కరాలను ఈసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.

- అక్షరదర్బార్, కాళేశ్వరం

# యూసీఎఫ్ నుంచి వరంగల్‌కు రూ.4,674 కోట్లు

## పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య



అక్షరదర్బార్, వరంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద వరంగల్ నగరానికి రూ.4,674 కోట్ల భారీ నిధులు మంజూరైనట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. తెలంగాణకు ఆమోదమైన మూడు ప్రాజెక్టులకు మొత్తం రూ.5,681 కోట్లు కేటాయించగా, అందులో అత్యధిక భాగం వరంగల్‌కే దక్కడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. ఈ నిధులతో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, వరద నివారణ పనులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ప్రజలకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద సమర్థవంతంగా ప్రతిపాదనలు ఉంచి ఈ నిధులు సాధించిందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. పట్టణాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి ఫలితంగానే వరంగల్‌కు ఈ స్థాయి నిధులు లభించడం జరిగిందన్నారు. ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 50 శాతం నిధులు సమకూర్చనున్నాయని, మిగతా భాగం హడ్కో రుణాల ద్వారా సమీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత వరంగల్ ఆధునిక నగరంగా రూపుదిద్దుకోనుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.



# టౌన్ షిప్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం

- నూతన పార్కు అభివృద్ధి పనులకూ శంకుస్థాపన
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, కుడా చైర్మన్, జిల్లా కలెక్టర్





# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

### మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

అక్షర దర్బార్, పరకాల: దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పరకాల కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గురువారం పట్టణ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డిలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని కొనియాడారు. భారతదేశానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసి దేశ పురోగతికి సరికొత్త దిశానిర్దేశం చేసిన మహోన్నత నాయకుడని అభినందించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో పనిచేస్తూ దేశ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొయ్యాడా శ్రీనివాస్, బండి శ్రీధర్, అల్లె దశరథం, పాలకుర్తి శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది: మల్లారెడ్డి

అక్షరదర్బార్, నడికూడ: దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నడికూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్నెం మల్లారెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పర్నెం మల్లారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ బలమైన పునాది వేశారని కొనియాడారు. దేశ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్లపూర్ సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దవేన రవీందర్, నడికూడ సర్పంచ్ కుడ్ల మలహల్ రావు, రాయపర్తి సర్పంచ్ రాజ జగత్ ప్రకాశ్, కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, ధర్మారం సర్పంచ్ బాసిక ఎల్లస్వామి, చౌటుపర్తి సర్పంచ్ ఓదెల సమ్మయ్య, సమన్వయ కమిటీ సభ్యులు పాడి వివేక్, నారగాని కుమారస్వామి, అప్పం చేరాలు, మహిళా నాయకురాలు బిల్లకంటి లక్ష్మి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ. 42.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

- పట్టణ సమగ్ర అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉంది
- చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

అక్షరదర్బార్, పరకాల: పరకాల పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో రూ. 42.50 లక్షల వ్యయంతో సీఎస్ఐ స్కూల్ నుంచి పిడుగుబండ వరకు నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డు పూర్తయితే శ్మశాన వాటికలకు వెళ్లే భక్తులకు, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు దుబాసీ వెంకటస్వామి, బొచ్చు శ్యామల, బెజ్జంకి పూర్ణచారి, గుడేల్లి సదానందం, కుక్కల విజయ్‌కుమార్, బండి శ్రీధర్, కొయ్యడ శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, సూదమల్ల రమేష్, అల్లె దశరథం, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సీహెచ్ రంజిత్, గంజి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



## రక్తదానం.. ప్రాణదానం

**బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్**

### పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకుల స్వచ్ఛంద రక్తదానం

అక్షరదర్బార్, పరకాల: రక్తదానం చేయడం అంటే మరొకరికి పునర్జన్మ ఇవ్వడమేనని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అన్నారు. గురువారం పరకాల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో ఆయన ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి నెలా రక్తం ఎంతో అవసరమవుతుందని, కాబట్టి యువత రక్తదాతలుగా మారి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలో రక్త కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం అనేది అన్ని దానాల్లోకెల్లా ఉత్తమమైన దానమని, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఈ సామాజిక కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పార్టీ నాయకులు మెంతుల సురేష్, సంఘ నరేష్, కుంటమల్ల గణేష్, తడక పూర్ణచందర్ మరియు పలువురు కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు.



## లక్ష్మీపురంలో వివాహిత దారుణ హత్య

### వివాహేతర సంబంధమే కారణమనే అనుమానం.. కాల్వలో మృతదేహం లభ్యం

అక్షర దర్బార్, దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామంలో ఓ వివాహిత మహిళ దారుణ హత్యకు గురికావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సుమలత (35) భర్త మహేందర్ నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఆమెకు జశ్వంత్, తేజస్విని అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమలత బుధవారం ఉదయం షాపింగ్ నిమిత్తం వరంగల్‌కు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అయితే సాయంత్రం వరకు ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. గురువారం ఏలుకుర్తి గ్రామస్థులు ఉపాధి హామీ పనులకు వెళ్తుండగా గ్రామ సమీపంలోని కెనాల్ కాలువలో సుమలత అచేతన స్థితిలో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న దుగ్గొండి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కాలువ సమీపంలో రక్తపు మరకలతో పాటు ఒక కత్తి, ఆమె మెడలోని ముత్యాల దండ, చెప్పులు, బ్యాగ్ చిందరవందరగా పడి ఉన్నాయి. నిందితుడితో సుమలత తీవ్రంగా పెనుగులాడినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారితీసిందా అనే కోణంలో గ్రామంలో చర్చ జరుగుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



## టౌన్ షిప్ లో రాజీవ్ గాంధీ విగ్రహం

అక్షరదర్బార్, గీసుకొండ: గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పరిధిలో గల రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) నిధుల నుంచి రూ.58 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ విగ్రహం, నూతన పార్కు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రాజీవ్ గాంధీ అని, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రాజీవ్ గాంధీ టౌన్ షిప్ పేరు పెట్టడం హర్షనీయమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేలా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడా సీపీఓ అజిత్ రెడ్డి, గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్, సంగెం తాసిల్దార్ రాజ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వావ్..మిస్ట్ బస్టాప్ లు

- -హనుమకొండలోని పెట్రోల్ పంప్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద ఏర్పాటు
- * ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, హనుమకొండ జిల్లా కలెక్టర్
- * మండు వేసవిలో ప్రజలకు ఉపశమనం కల్పించడమే లక్ష్యం



అక్షరదర్బార్, హనుమకొండ: మండు వేసవి బారీ నుండి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు హనుమకొండలో రెండు మిస్ట్ బస్టాప్ లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ప్రప్రథమంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రధాన గేట్ పక్కన, పెట్రోల్ పంప్ పబ్లిక్ గార్డెన్ దగ్గర మిస్ట్ బస్టాప్ లను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే, కలెక్టర్ లు లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బస్టాప్ లలో ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రజలతో కలిసి కూర్చున్నారు. మిస్ట్ బస్టాప్ లను మండు వేసవిలోనూ ప్రజల సౌకర్యార్థం చల్లగా ఉండేలా తీర్చిదిద్దారు. అందంగా తయారు చేసిన మిస్ట్ బస్టాప్ లలో ప్రజలు ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేలా పై కప్పు నుండి సన్నటి నీటి తుంపరలు చల్లగా ఉంచుతాయి. వేసవి దృష్ట్యా వడగాలులు వీస్తుండగా వాటి నుండి రక్షణగా ఈ మిస్ట్ బస్టాప్ లు చల్లధనానికి కేరాఫ్ గా నిలుస్తున్నాయి. మిస్ట్ బస్టాప్ లలో పైన ఉన్న వెదురు తడకలపై నుండి ప్రత్యేకంగా మోటార్ల, పైపుల ద్వారా చిన్నచిన్న నీటి తుంపరలు పడుతుంటాయి. దీంతో బస్టాప్ లో ఉన్న ప్రజలకు శీతల వాతావరణం ఏర్పడుతుంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని, బస్సుల్లో వెళ్లేందుకు వేచి చూస్తుంటారని, ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రయాణ సౌకర్యం దృష్టిలో ఉంచుకుని మిస్ట్ బస్టాప్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మిస్ట్ బస్టాప్ లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. మిస్ట్ బస్టాప్ లలో చల్లని వాతావరణం ఉంటుందన్నారు. ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎండవేడిమి నుండి ప్రజలకు ఉపశమనం కోసం మిస్ట్ బస్టాప్ లను జీడబ్ల్యూఎంసీ నిధులతో రెండింటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడే ఉన్న పలువురు యువకులు, మహిళలు మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండుతున్నాయని, ఎండ వేడిమి నుండి ఉపశమనం కల్పిస్తూ చల్లగా ఉండేవిధంగా కొత్తగా బస్టాప్ లను తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తొగరు రామయ్యపల్లెలో ముగిసిన పైపులైన్ పనులు

### సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్

దుగ్గొండి, అక్షర దర్బార్: దుగ్గొండి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తొగరురామయ్యపల్లె హ్యాబిటేషన్‌లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో నల్లాల బావి నుంచి వాటర్ ట్యాంక్ వరకు కొత్త పైపులైన్ ఏర్పాటు పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్ తెలిపారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక నిధులతో ఈ పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వేసవికాలంలో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు చేపట్టామన్నారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంట్రా ఏఈ మంగ్యా, పంచాయతీ కార్యదర్శి వైనాల రాజు, గ్రామ పెద్దలు పల్లె శ్యామ్, దద్దనాల యుగంధర్, జైపాల్ రెడ్డి, లింగరెడ్డి, రవీందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## చిట్యాలలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి మాట్లాడుతూ.. భారతదేశానికి టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగాన్ని పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించడంతో పాటు, ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ప్రాధాన్యత కల్పించిన మహానేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ కటుకూరి పద్మా నరేందర్, సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, కంచర్ల కిష్టయ్య, బుర్ర శ్రీనివాస్, చిలుముల రాజమౌళి, గుర్రపు నర్సయ్య, ఆకుల ఆది రెడ్డి, యూత్ నాయకులు ముష్కే నాగరాజు, తుమ్మ రమేష్, గంపల మధుకర్, శంకరయ్య పాల్గొన్నారు.



## పార్కింగ్ స్థలాలను పరిశీలించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ప్రధాన రోడ్డు మార్గంలో వాహన పార్కింగ్ కోసం అవసరమైన స్థలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆయన ట్రాఫిక్ అధికారులతో కలిసి హనుమకొండలోని అశోక జంక్షన్, హన్మకొండ చౌరస్తా, ఏనుగులగడ్డతో పాటు వరంగల్ నగరంలో పోచమ్మ మైదాన్, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతాలను సందర్శించి వాహన పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన స్థల విస్తీర్ణం, సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా ట్రై సిటి ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్ ముందు వాహనాలను పార్కింగ్ చేయకుండా భవన సెల్లార్లలో పార్కింగ్ చేసే విధంగా సంబంధిత వ్యాపారస్తులను ట్రాఫిక్ అధికారులు అదేశించాలని, తద్వారా కొంత వరకు పార్కింగ్ సమస్యను అధిగమించగలమని పెర్కొన్నారు. ఈ పరిశీలనలో సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా నేహ్రా, ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారయణ, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు వెంకన్న, సుజాత, హన్మకొండ, మట్టెవాడ ఇన్ స్పెక్టర్లు శివకుమార్, కరుణాకర్‌తో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## షార్ట్ సర్క్యూట్‌తో 350 బస్తాల మొక్కజొన్న దగ్ధం

- కన్నీరుమున్నీరవుతున్న రైతు



అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 350 బస్తాల మొక్కజొన్నలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వెంకటాపురం శివారు బీసీ కాలనీకి చెందిన రైతు పొగాకు శ్రీనివాస్ ప్రభుత్వ గిడ్డింగుల గోదాము సమీపంలోని తన రెండెకరాల పొలంలో మొక్కజొన్న పంటను కోసి కుప్పలుగా పోశారు. గురువారం మధ్యాహ్నం వీచిన బలమైన గాలికి కరెంటు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగసిపడటంతో ఈ ప్రమాదం జరిగింది. కాలిపోయిన మొక్కల విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు పొగాకు శ్రీనివాస్ కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు గౌడ్ బాధితుడిని పరామర్శించి పంట రాశులను పరిశీలించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మరియు విద్యుత్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి రైతుకు పరిహారం అందేలా కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.


## అగ్ని ప్రమాదంలో మిర్చి పంట భస్మం

### అప్పుల ఊబిలో అన్నదాత



అక్షర దర్బార్, చిట్యాల: అప్పుల బాధల నుండి బయట పడవచ్చనే ఆశతో ప్రాణం పెట్టి పెంచుకున్న మిర్చి పంట చేతికందే సమయంలో అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కావడంతో చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి సి గ్రామానికి చెందిన రైతు బాలవేణి వేణు కుటుంబం రోడ్డున పడింది. బాలవేణి వేణు తనకున్న ఎకరం పది గుంటల భూమిలో మిర్చి తోట సాగు చేశారు. అంతకుముందు వచ్చిన అరకొర లాభాలను, మరికొంత అప్పును కలిపి తిరిగి మిర్చి పంటకే పెట్టుబడిగా పెట్టారు. తీరా పంట కోతకు వచ్చే సమయంలో ఊహించని విధంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మిర్చి తోట పూర్తిగా కాలిపోయింది. రూ. వేల పెట్టుబడి బూడిద కావడంతో, ఉన్న అప్పులు తీరేదెలా, బతుకు గడిచేదెలా అని రైతు కుటుంబం విలవిలలాడుతోంది. నష్టపోయిన తమ్ముడిని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వేణు కుటుంబంతో పాటు గ్రామస్థులు వేడుకుంటున్నారు.







# త్రివేణి సంగమంలో పుష్కర పరవళ్లు

- గవర్నర్ దంపతులు, కంచి పీఠాధిపతి, మంత్రులు, ఎమ్మెల్యేలు పుణ్యస్నానాలు
- శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారు తొలి పుష్కర స్నానం
- కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో గవర్నర్ దంపతుల పూజలు
- నూతన మ్యూజియంను ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా..
- వారణాసి పండితుల 'నవరత్న మాలా హారతి'తో పరవశించిన భక్తజనం

- దక్షిణ కాశిలో ఆధ్యాత్మిక వెల్లువ.. కాళేశ్వరం తీరాన 'సరస్వతీ' వైభవం
- 'అధికారికంగా' సరస్వతీ అంత్య పుష్కర మహోత్సవం
- వేద మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా అంత్య పుష్కరాల అంకురార్పణ



అక్షరదర్బార్, కాళేశ్వరం : గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన పవిత్ర ప్రాంతంలో వేడుకలు మొదలయ్యాయి. గోదావరి పుష్కరాల సరస్వతి ఘాట్ (వీఐపీ ఘాట్) వేదికగా ఈ పుష్కరాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు–శైలజా రామయ్యర్ (దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ) దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ హన్మమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి, ట్రేడింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు నిర్వహించిన అనంతరం సరస్వతి నది అంత్య పుష్కర మహోత్సవ వేడుకలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు.

### కంచి పీఠాధిపతి తొలి స్నానం..

అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారు తొలి పుష్కర స్నానాన్ని ఆచరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితులు సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని, శ్రీ శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలోని యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి భక్తులకు సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు.

### పుణ్యస్నానాలు ఆచరించిన గవర్నర్ దంపతులు

ఈ మహావేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు విచ్చేశారు. వారికి మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ ఘనస్వాగతం పలికారు. గవర్నర్ దంపతులు సరస్వతీ ఘాట్ వద్ద పవిత్ర పుష్కర స్నానమాచరించి, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి, వేద పండితుల ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

### కాశీ పండితుల నవరత్న మాలా హారతి

12 రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం వారణాసి (కాశీ) క్షేత్రంలో గంగా హారతి ఇచ్చే 7 గురు ప్రముఖ పండితులచే త్రివేణి సంగమం వద్ద 'సరస్వతి నవరత్న మాలా హారతి' అత్యంత కన్నులపండువగా నిర్వహించారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ తొమ్మిది విశిష్ట హారతులను గవర్నర్ దంపతులు, కంచి స్వామి, మంత్రులు, అధికారులు, వేలాదిమంది భక్తులు తన్మయత్వంతో వీక్షించారు. నవరత్న హారతులు ఓంకార హారతి, నాగ హారతి, పంచ హారతి, సూర్య హారతి, చంద్ర హారతి, నంది హారతి, సింహ హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతి.



### రూ. 1.20 కోట్లతో నూతన మ్యూజియం ప్రారంభం

**సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా కాళేశ్వరంలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన శిలా సంపద మ్యూజియంను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కంచి పీఠాధిపతితో కలిసి ఘనంగా ప్రారంభించారు. మ్యూజియంలోని విభిన్న శిలా సంపదను గవర్నర్ ఆసక్తిగా వీక్షించారు. మన చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబించేలా ఉన్న ఈ మ్యూజియాన్ని విద్యార్థులు, యువత సందర్శించి అవగాహన పెంచుకోవాలని గవర్నర్ సూచించారు.**

---



# పరకాలలో భారీ మంటలు..

## సీఐ క్రాంతికుమార్ చొరవతో తప్పిన ప్రమాదం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ఇండియన్ గ్యాస్ గోదాం వెనుక ఉన్న పొలాల్లో పంట వ్యర్థాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రతకు మంటలు సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో వేగంగా వ్యాపించి వ్యవసాయ మోటార్లు, పైపులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పరకాల సీఐ క్రాంతికుమార్ వెంటనే సిబ్బంది మరియు అగ్నిమాపక వాహనంతో రంగంలోకి దిగారు. మంటలు పక్కనే ఉన్న మామిడి తోటతో పాటు గ్యాస్ గోదాం వైపు దూసుకుపోతుండగా, సీఐ క్రాంతికుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఎండల దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చవద్దని సీఐ సూచించారు.